క్లుప్తంగా

వీఎంసీలో అంతర్గత బదిలీలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్యం విభాగంలో పలువురు సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. 11వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న నూతలపాటి జానకిరామయ్యను 37వ డివిజన్‌కు అక్కడ విధులు నిర్వహిస్తున్న బి.యోగేంద్రను 43వ డివిజన్‌కు బదిలీ చేశారు. 43వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పిళ్లా రమేష్‌ను 11వ డివిజన్‌కు బదిలీ చేశారు. సర్కిల్–1 శానిటరీ సూపర్‌వైజర్ ఆర్ ఓబేశ్వరరావును వెహికల్ డిపో ఇన్‌చార్జిగా, 36వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీఎస్ శ్రీధర్‌ను అసిస్టెంట్ ఇన్‌చార్జిగా నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

జాతీయ క్రీడల్లో సిద్ధార్థ విద్యార్థినుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): గుజరాత్‌లో జరిగిన 67వ జాతీయ స్కూల్ గేమ్స్ 2023–24 పోటీల్లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ తెలిపారు. ఆ పోటీల్లో ఆర్చరీలో తమ కళాశాల ఇంటర్మీడియెట్(సీఈసీ) ఫస్టియర్ విద్యార్థిని టి.భవన రాజేశ్వరి రెండు బ్రాంజి మెడల్స్ గెలుపొందగా, సీనియర్ ఇంటర్మీడియెట్ విద్యార్థిని బి.షణ్ముఖినాగసాయి ఒక సిల్వర్, ఒక బ్రాంచి మెడల్ సాధించారని తెలిపారు. దీంతో వారిద్దరూ ఇండియన్ టీమ్ ఫర్ వరల్డ్ స్కూల్ గేమ్స్‌కి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. వారికి మంగళవారం ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, పలువురు అధ్యాపకులు, సహచర విద్యార్థినులు అభినందనలు తెలిపారు.

అక్షీశ్వర మహాదేవునికి తండులాభిషేకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం అమావాస్యను పురస్కరించుకుని లోక కల్యాణార్థం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన అక్షీశ్వర మహాదేవునికి రెండు వేల కిలోల బియ్యంతో అభిషేకం నిర్వహించారు. శ్రీ శివజ్ఞాన పీఠాధిపతి శ్రీ శివాచార్య స్వామి చేతుల మీదుగా తండులాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా శివాచార్యస్వామి మాట్లాడుతూ చంద్రదోష నివారణ, మనస్సుకు ప్రశాంతత కలిగించేందుకు తండులాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. శివచార్య స్వామి విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తొలుత అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ రెండు వేల కిలోల బియ్యంను ట్రస్ట్ సభ్యులతో కలిసి స్వామివారికి సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు తండులాభిషేకంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ విద్యార్థి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫ్రైజర్‌పేట ఎర్రకట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ రియాజ్ కుటుంబం నివాసం ఉంటుంది. రియాజ్ వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. రియాజ్‌కు ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు రిజ్వాన్ సత్యనారాయణపురంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రిజ్వాన్ అదే కాలేజీలో చదువుతున్న విద్యార్థినితో ఫోన్ చాటింగ్ చేస్తుండటంతో ఆ విషయం కాలేజీ ప్రిన్సిపాల్‌కు తెలిసింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి, ఐదు రోజులు రిజ్వాన్‌ను కాలేజీకి పంపవద్దని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రిజ్వాన్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ నుంచి అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న ఓ భారీ భవనాన్ని వీఎంసీ అక్రమ నిర్మూలన దళం మంగళవారం కూల్చివేసింది. విజయవాడ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి జీవీవీజీఎస్ ప్రసాద్, స్థానిక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వశీంబేగ్ ఆధ్వర్యంలో పటమట స్టెల్లా కళాశాల సమీపంలో జాతీయరహదారి సర్వీస్‌రోడ్డులో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన టీవీఎస్ షోరూం వీఎంసీ నుంచి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ఫిర్యాదులు అందటంతో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశాలతో మంగళవారం వీఎంసీ అధికారులు పరిశీలించి భవనంలో జరుగుతున్న నిర్మాణాలను, మొదటి అంతస్తులో వేస్తున్న రేకులను తొలగించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జగన్ మళ్లీ సీఎం కావాలి

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- 44, 47 డివిజన్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజానీకం ఆకాంక్షిస్తోందని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 44, 47వ డివిజన్లలోని 156, 148 సచివాలయాల దగ్గర మంగళవారం ఏర్పాటు చేసిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు చేకూరిన లబ్ధితో పాటు జరిగిన అభివృద్ధికి సంబంధించిన వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డులను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, గోదావరి గంగలతో కలిసి వెలంపల్లి ఆవిష్కరించారు. 44వ డివిజన్ పరిధిలోని విద్యాధరపురం చెరువు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారితో కలిసి వెలంపల్లి ఎగురవేశారు. అలాగే 47వ డివిజన్‌లో చిట్టిగారి పార్క్ వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాను స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి, గత టీడీపీ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించేందుకే 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో సచివాలయ పరిధిలో పేద ప్రజలకు ప్రభుత్వం నుంచి ఏ మేరకు సంక్షేమ పథకాలు అందాయి, అలాగే ఆ ప్రాంతంలో ఏఏ అభివృద్ధి పనులు జరిగాయన్న పూర్తి వివరాలతో కూడిన బోర్డులను ప్రదర్శిస్తున్నామని చెప్పారు.



47వ డివిజన్‌లో డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, గోదావరి గంగ

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణకంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందిస్తుందని, ఇవి కొనసాగాలంటే రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి అవసరమని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిందని చెప్పారు. గత టీడీపీ పాలనలో ప్రజలను గ్రాఫిక్స్‌తో మభ్యపెట్టి మోసం చేశారన్నారు. సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలతోపాటు వైద్య సేవలుకూడా గడప వద్దకే వచ్చాయన్నారు.

తాత్కాలిక అమరావతి పేరుతో దోచుకున్నారు

రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఏపీకి తాత్కాలిక రాజధాని పేరుతో చంద్రబాబు అండ్ కో అందినకాడికి దోచుకున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. అదే విధంగా రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తామంటూ గ్రాఫిక్స్ చూపించి ప్రజలను ఐదేళ్ల పాటు మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకో..దాచుకో...తినుకో అనే విధంగా పాలన సాగిందని తెలిపారు. ఏపీకి జగనే ఎందుకు కావాలో ఆమె వివరించారు. కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, గోదావరి గంగ, వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, దేరంగుల రమణ, యశోధర్, కామళ్ల జోజి, యరజర్ల మురళి, కూరాకుల నాగ, నన్నం దుర్గ, కామళ్ల కిషోర్, వరకాల జోషి, కె.కాశీశ్వరరాజు, దిద్దుకూరి శివ, పగిడిపల్లి పాండు, పి.వెంకటరావు, గాలి దుర్గారావు, టి.ఆనంద్, మైలవరపు దుర్గారావు, వీరంకి సత్యనారాయణ, ముత్తా వాసు, షఫీఉల్లా, వల్లం రవికుమార్, ఎమ్ సీతారామయ్య, తాంగ్ర ఇంద్రకుమార్, రెడపంగు క్రాంతి, యెనిగళ్ల అమర్ బాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



44వ డివిజన్‌లో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, రత్నకుమారి, నాయకులు

18న సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం కొండపై వేం చేసి ఉన్న శ్రీ స్వయంబు శ్రీ వల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్య స్వామి వారి దేవస్థానంలో 18వ తేదీన స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తొత్తడి నాగరాజు పేర్కొన్నారు. 18వ తేదీ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, అనంతరం ఏకాదశ ద్రవ్య మహాభిషేకం, విశేష అలంకరణ, 9 గంటలకు లక్ష్మీగణపతి హోమం, సుబ్రహ్మణ్య స్వామి వారి మూలమంత్ర హోమం, 10 గంటలకు స్వామి వారిని పెళ్లి కుమారుడి అలంకరణ జరుగుతుందన్నారు. 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం, 12 గంటలకు అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 5.15 గంటలకు స్వామి వారి ఊరేగింపు, రాత్రి 7 గంటలకు పవళింపు సేవతో ఉత్సవం ముగుస్తుందన్నారు.

వీల్‌చైర్ అందజేత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన మహిళకు అమ్మ సేవా చారిటబుల్ ట్రస్ట్ మంగళవారం వీల్‌చైర్‌ను అందించింది. కొత్తపేట ఆంజనేయ వాగు ప్రాంతానికి చెందిన డి.శ్రీదేవి ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు కోల్పోయింది. దీంతో నడిచేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ట్రస్ట్ నిర్వాహకులు ఆర్.మాధవ్, కాటుపిళ్ల సూర్యప్రకాష్‌లు వీల్‌చైర్‌ను అందజేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటానని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. హనుమాన్‌పేటలోని వీఎంసీ వెహికల్ డిపోను మంగళవారం ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణకు వెహికల్ డిపో నుంచి వెళ్లే వాహనాలకు వీఎంసీ ఇంధనానికి ధర చెల్లిస్తుందన్నారు. ఆ ఇంధనాన్ని డ్రైవర్లు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేపట్టారు. విచారణలో వాహన డ్రైవర్లు ఇంధనాన్ని దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. సదరు డ్రైవర్లు బొల్లా సూర్యప్రకాష్, మిందల జమల కేశవను విధుల్లో నుంచి సస్పెండ్ చేయటంతో పాటు పోలీస్ కేసు నమోదు చేశారు. దీనిపై పూర్తి విచారణకై అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) సత్యవతిని నియమించారు. ఈ సందర్భంగా వెహికల్ డిపోలో ఉన్న సిబ్బందితో ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణకు కేటాయించిన వాహనాలు, దానిలో ఉన్న ఇంధనం ప్రతిదీ పారిశుద్ధ్య నిర్వహణకే ఉపయోగించాలన్నారు. పారిశుద్ధ్య వాహనలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉందని తద్వారా వాళ్లు ఎటువైపు వెళ్తున్నారో ప్రతిదీ రికార్డులో ఉంటుందని చెప్పారు. విధుల్లో అలసత్వం ఉండకూడదని హెచ్చరించారు.



వెహికల్ డిపోలో సిబ్బందిని విచారిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఏపీపీఎస్సీ పోస్టుల సంఖ్యను పెంచాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): గ్రూప్–1, 2 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఏపీపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యను 2 వేలతో పాటు అభ్యర్థుల వయో పరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చా వేదిక నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7న గ్రూప్–2 నోటిఫికేషన్ 897 పోస్టులకు, 8న గ్రూప్–1 నోటిఫికేషన్ 81 పోస్టులకు విడుదల చేసిందన్నారు. పోస్టుల సంఖ్య కనీసం 2 వేలకు పెంచాలని కోరారు. ముందు గ్రూప్–2 నిర్వహించి తర్వాత గ్రూప్–1 నిర్వహిస్తే నిరుద్యోగులకు ఉపయోగం ఉంటుందన్నారు. డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాము, రామన్న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగులకు ఉచిత స్టడీ సర్కిల్స్ తక్షణమే ప్రారంభించాలని కోరారు. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో తీసుకోవాలని, నెగిటివ్ మార్కులు పద్ధతిని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, డీవైఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిర్మూలనకు పటిష్ట చర్యలు

- ర్యాగింగ్ అంటూ దుష్ప్రచారం తగదు
- ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులను ర్యాగింగ్ చేయకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడితే విధించే శిక్షలను కూడా సీనియర్స్‌కు తెలియజేశామన్నారు. తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైద్య కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనకు తీసుకున్న చర్యలను వివరించారు. కొన్నేళ్లుగా కొత్తగా చేరిన విద్యార్థులను సపరేట్ బ్లాక్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. వారికి ఆహారం కూడా రూమ్స్‌కి అందజేస్తున్నామన్నారు. కొత్త విద్యార్థులు హాస్టల్ నుంచి కాలేజీకి, లైబ్రరీకి వెళ్లేటప్పుడు సెక్యూరిటీ ఉంటుందన్నారు. అంతేకాకుండా ప్రతి రోజూ రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య బీట్ కానిస్టేబుల్స్‌తో పాటు, ఎస్ఐ కూడా రౌండ్స్ వేస్తుంటారని, వారంలో ఒకటి, రెండు సార్లు సీఐ కూడా రౌండ్స్‌కి వస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. కళాశాలలో యాంటీర్యాగింగ్ కమిటీ ఏర్పాటు చేశామని, అది ఎప్పుడూ మానిటరింగ్ చేస్తుంటుందన్నారు.



యాంటీ ర్యాగింగ్‌పై తీసుకున్న చర్యలను వివరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

దుష్ప్రచారం నమ్మవద్దు..

ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన విద్యార్థులను హాస్టల్‌లో ర్యాగింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలు దుష్ప్రచారమేనని ఆయన పేర్కొన్నారు. ఎవరూ నేషనల్ మెడికల్ కమిషన్‌కు ఫిర్యాదు చేయలేదని, వారి నుంచి కళాశాలకు కూడా ర్యాగింగ్‌పై ఎలాంటి మెయిల్స్ రాలేదన్నారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రాలేదని చెప్పారు. కళాశాల ప్రతిష్టతను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సీనియర్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఆయన తెలిపారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు మరింత అత్యుత్తమ ప్రదర్శనతో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. వ్యాయామ విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు డాక్టర్ డి.యుగంధర్ పర్యవేక్షణలో చాంపియన్‌షిప్ రన్నర్స్‌గా నిలవటం కళాశాలకు గర్వకారణమన్నారు. తమ విద్యార్థులు కే కిషోర్, జీ తరుణ్ కుమార్, జీ వెంకటేష్, నీ ఉమేష్ దుర్గారామ్‌లు సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు డాక్టర్ పద్మనాభం, సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. మంగళవారం విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను వైఎస్సార్ సీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ కలిసి పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. వేడుకలకు హాజరు కావాలని కిరణ్ రాజ్ ఎమ్మెల్యే వెలంపల్లిని కోరారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు.

17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 17వ తేదీ నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. 17వ తేదీ ఆదివారం విష్వక్సేన పూజ, శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మ వారికి పంచామృత అభిషేకాలు 23వ తేదీ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం స్వామి వారి నగరోత్సవ సేవ జరుగుతుందన్నారు. జనవరి 8వ తేదీ సోమవారం 23వ పాశురం, 9వ తేదీ 24వ పాశురాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ముత్యాల హారతి, జనవరి 10వ తేదీ కృష్ణ జన్మోత్సవం, 11న స్వామి వారికి ఆభరణ, వస్త్ర ఉత్సవం, 12న కుడారై ఉత్సవం, 13న శ్రీవారి శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారికి అభిషేకాలు, 14న భోగి పండుగ, గోదాదేవి కల్యాణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.



చిట్టినగర్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం

భక్తులకు అన్నప్రసాద వితరణలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి దంపతులు



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ ఆదిలక్ష్మి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున స్వామి వారికి పంచామృత, 11 ద్రవ్యాలతో అభిషేకాలు, అనంతరం అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నరేంద్రకుమార్ దంపతులు పాల్గొన్నారు. దేవస్థానం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేయర్ దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు వెన్నం రజనీకుమార్ ఆవిష్కరించారు. వందలాది మంది భక్తులకు, అయ్యప్ప, భవానీ, శివదీక్షపరులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

కొత్తపేటలో..

కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి వారి ఆలయంలో భక్తులకు అన్న ప్రసాదవితరణ జరిగింది. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ, దాతలు బీవీఎస్.నాయుడు, చింతలపూడి సత్యనారాయణలతో పాటు పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమానికి సహకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, దేవస్థాన చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. 3 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

17న జాతీయ పెన్షనర్ల దినోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన వేడుకలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు తెలిపారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వేడుకల వివరాలను వెల్లడించారు. పెన్షన్ పితామహుడు స్మృత్యర్థం 75వ వసంతంలోకి అడుగిడిన 15 మంది పెన్షనర్లను సత్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే క్యారమ్స్ పోటీలో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. సమావేశంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్‌కె ఇనయతుల్లా, సభ్యులు డి.శేషగిరి రావు, పి.శ్రీనివాసరావు, పి.పట్టాభిరామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ దినోత్సవ కార్యక్రమాలకు సంబంధించి ముద్రించిన ఆహ్వాన పత్రికను విడుదల చేశారు.

అవగాహనతోనే మాదక ద్రవ్యాల కట్టడి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, అవగాహనతోనే మాదక ద్రవ్యాలను కట్టడి చేయవచ్చని నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక అన్నారు. రాణిగారితోటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా ప్రభావం మంచికంటే కీడు ఎక్కువగా చేస్తోందన్నారు. వ్యక్తుల్లో ఒంటరితనం, డిప్రెషన్‌కు సోషల్ మీడియా కారణమవుతుందని, తద్వారా అనేక మంది నిద్రలేమికి గురవుతున్నారని తెలిపారు. నిత్య జీవితంలో చాలా మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, సరైన అవగాహనతో మాదక ద్రవ్యాలను కట్టడి చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా తీసుకుంటే మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చని చెప్పారు. జోనల్ కో ఆర్డినేటర్ నజ్మా మాట్లాడుతూ.. నూజివీడు మండలం పొనసనిపల్లిలో నవజీవన్ బాల భవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీ–ఎడిక్షన్ సెంటర్‌లో చికిత్స ద్వారా మత్తు పదార్థాల వ్యసనం నుంచి సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తల సూపర్‌వైజర్ కె.వి.రమణి, సీహో స్నేహలత, శివపార్వతి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ ప్రియాంక

సంపత్‌రావు సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నేత పొదిలి సంపత్‌రావు కార్మికులకు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ట్రేడ్ యూనియన్ నాయకులు పొదిలి సంపత్‌రావు జ్ఞాపకార్థం ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు పొదిలి చంటిబాబు ఆధ్వర్యంలో మంగళవారం విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, మైలపల్లి పోలీస్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మాట్లాడుతూ గట్టు వెనుక ప్రాంతంలో సంపత్‌రావు అందరికీ సుపరిచితుడన్నారు. తాను పని చేసే ఆర్టీసీ సంస్థలోని కార్మికులకే కాకుండా సామాన్య ప్రజలకు తనవంతు సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమ నిర్వాహకుడు చంటిబాబు మాట్లాడుతూ దశాబ్ద కాలం క్రితం మరణించిన తన తండ్రి సంపత్‌రావు జ్ఞాపకార్థం ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సిరిపురపు ఫిలిప్స్ గ్రిటస్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పోతిరెడ్డి సుబ్బారెడ్డి, ఏలూరు వెంకన్న, అల్లం పూర్ణ, రుద్రశంకర్, ఎ శ్రీకాంత్, రహీం, ఉమ, పాఠశాల హెచ్‌ఎం మాతంగి కోటయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేస్తున్న నాయకులు

- ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని జమాక్ రెసిడెన్షియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. త్రిపురనేని హనుమాన్ నాగ చంద్, మేరుగ వెంకట రాజారావు అధ్యక్షులుగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ మొత్తం 422 మంది నివశిస్తారు. ఇందులో 222 ఓట్లు ఉన్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.